

# అంకుల్ సామ్

– మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

**ముకుందం జీమేట్** - టోఫెల్‌కి సంబంధించిన ఎక్సర్‌సైజ్ టెస్ట్ పేపర్స్‌ని ఆన్సర్ చేస్తున్నాడు. టీచర్ సలహామీద లైబ్రరీకి వెళ్ళి ‘రీడర్స్ డైజెస్ట్’లోని ‘ఇట్ పేస్ టు ఇంక్రీజ్ యువర్ వర్డ్ పవర్’ కాలమ్‌ని చదువుతూ, రోజూ హిందూ పేపర్‌ని, ముఖ్యంగా సంపాదకీయాలు చదువుతూ, ఇంగ్లీష్‌ని అభివృద్ధి చేసుకోసాగాడు.

తన భవిష్యత్తు ఆ పరీక్షలు పాసవడం మీద ఆధారపడివుందని తెలుసు కాబట్టి ముకుందం దీక్షగా చదవసాగాడు.

వారానికి ఈ ఉత్తరం వాణికి రాస్తూనే ఉన్నాడు. ఎప్పటిలానే ఒక్క వాక్యం రాస్తాడు.

డార్విన్ సిద్ధాంతం తప్పని నిన్ను చూసినప్పుడు అనిపించింది.

‘మే కాజ్ ఇర్రెగ్యులర్ హార్ట్ బీట్’ అన్న వార్నింగ్ సైన్‌ని ధరిస్తున్నావా. నీలాంటి అందమైన అమ్మాయి తప్పనిసరిగా అది ధరించాలి.

వాణి కూడా జవాబుగా ఉత్తరాలు రాస్తూంటుంది. అందులో ప్రేమ ప్రసక్తి తక్కువ. తన అమెరికన్ జీవితం గురించి ఎక్కువగా రాస్తుంటుంది.

"నిన్న నాకు కాప్ టిక్కెట్ ఇచ్చాడు. దాంతో కారు ఇన్స్యూరెన్స్ పెరుగుతుందని మా నాన్న స్పీడ్‌గా వెళ్ళినందుకు నన్ను తిట్టారు. రాడార్ వుందని నాకేం తెలుసు?"

"నువ్వేం రాశావో నాకర్థం కాలేదు" అని జవాబు రాస్తాడు ముకుందం. ఈసారి వివరంగా రాస్తుంది వాణి.

"ప్రతీ రోడ్‌కి స్పీడ్ లిమిట్ ఉంటుంది. దాన్ని మించి డ్రైవ్ చేసిన కారు డ్రయివర్‌కి టిక్కెట్ ఇస్తారు. కోర్టులో పరిహారం చెల్లించాలి. అలా ఓసారి టికెట్ తీసుకుంటే కారుకి కట్టే ఇన్స్యూరెన్స్ ప్రీమియమ్ పెరుగుతుంది. మనం స్పీడ్ వెళ్ళి యాక్సిడెంట్ చేసే అవకాశం వుంటుంది కాబట్టి.

"అయితే టికెట్ తీసుకుని పెనాల్టీ కట్టకుండా నేషనల్ ట్రాఫిక్ స్కూల్‌కి హాజరవ్వచ్చు. అప్పుడు టిక్కెట్టు వుండదు. ఇన్స్యూరెన్స్ ప్రీమియం పెరగదు. ఆ స్కూల్లో ట్రాఫిక్ రూల్స్, రెగ్యులేషన్స్ బోధిస్తారు. బోర్ అని టిక్కెట్టే తీసుకున్నాను.

"ప్రతి జూలై ఫోర్త్ మేమిక్కడ ‘ఇండిపెండెన్స్ డే’గా సెలబ్రేట్ చేసుకుంటాము. ఫైర్ వర్క్ ఎట్సెట్రా. 1776లో ఆ రోజు అమెరికా బ్రిటిష్ రూల్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశం అయ్యింది.

"అమెరికా కాపిటలిస్టిక్ కంట్రీ అంటారు. కానీ అది తప్పు ఇక్కడ ప్రతివ్యక్తీ తను చేసే పని విషయంలో సీరియస్‌గా ఉంటారు. పోటీ, కష్టపడి పనిచేయటం వీళ్ళ రక్తంలో వుంది. ఒకరితో మరొకరు పోటీపడి, కష్టపడి తమ పనిని చేస్తారు. దానితో శ్రద్ధగా సమర్ధంగా పనిచేసే వాడికే ఉద్యోగం వుంటుంది. లేనివాడికి ఊడుతుంది. దాంతో ‘సర్‌వైవల్ ఆఫ్ ద ఫిట్టెస్ట్’ సొసైటీగా మారింది. తన జాబ్‌లో

ఎక్సలెన్సీ కోసం ప్రతి అమెరికన్ కృషి చేస్తాడు. అమెరికా ఆర్థికపరంగా కానీ, సాంకేతికంగా కానీ గొప్పదేశం అవడానికి కేవలం ఈ ఒక్క విషయమే ఎక్కువ సహాయం చేసింది. ఈ 'ఎక్సలెన్స్' పోటీవల్లే సర్వీస్‌లో కానీ, ఉత్పత్తిలో కానీ క్వాలిటీ కనిపిస్తుంది.

"నీకో ఉదాహరణ చెపుతాను. పూర్వం ఉత్తరం ఎడ్రస్ చేశాక కవరుమీద మళ్ళీ ఆ ఉత్తరం పంపేవారి ఎడ్రస్ రాస్తూండేవారు. ఓ టైపిస్ట్ మిగిలిన వాళ్ళకన్నా త్వరగా ఎక్కువ లెటర్స్ టైప్ చేసి పోస్టు చేస్తున్నప్పుడు క్రింద ఓ కార్బన కాపీ వుంచి ఆ లెటర్‌లోని చిరునామాకి అదనంగా ఓ కాపీతీసి దాన్ని కట్ చేసి కవర్ మీద అతికించడంతో సమయం సేవ్ అయి ఇతరులకన్నా త్వరగా పనిచేసేది. కార్బన్ కాపీవల్ల బట్వాడాలో అక్షరాలు చెరిగిపోయేవి. దాంతో మరో వ్యక్తి ఉత్తరాన్ని ఎవరికి పంపాలో టైప్ చేసిన చిరునామా కనపడేలా మడిచి, కవర్లో వుంచి, అది కనపడే మేర కవరు చింపి, అతికించి పంపసాగాడు. మరో వ్యక్తి నీట్‌గా వుంటుందని కవర్లని ఎడ్రస్ కనపడే చోట్ కట్‌చేసి సెల్‌ఫోన్ టేప్‌ని ఆ మేర అతికించి పంపసాగాడు. ఇదంతా గమనించిన మరో వ్యక్తి తరచూ ఉపయోగించే అడ్రస్‌లు వంద చొప్పున ప్రింట్ చేసి అడ్రస్ లేబిల్స్‌ని అమ్మే వ్యాపారాన్ని ప్రారంభించాడు. అది విండో కవర్ కన్నా చీప్ అవుతుందని.

"అమెరికన్ వ్యవస్థలో పోటీ, హార్డ్‌వర్క్ లేకపోతే ఇవన్నీ కనిపెట్టేవారు కారు. ఇలా ప్రతి చిన్న వస్తువు తయారీలోను ఎంతో కొంత ఎక్సలెన్స్‌ని ప్రవేశపెట్టడానికి ప్రతివాళ్ళూ తపనపడతారు.

"ఇక్కడ వున్న మరో ఆకర్షణ పేటెంట్ సిస్టమ్. ఓ మనిషి ఓ విండో కవర్‌కానీ, కార్బన్‌లెస్ కాగితం కానీ కనిపెడితే దాన్ని పోస్ట్ ద్వారా పేటెంట్ చేసుకోవచ్చు. ఆ తర్వాత ఆ ప్రొడక్ట్స్‌ని తయారు చేసి అమ్మడానికి పెద్ద కంపెనీలని కాంటాక్టు చేస్తే ఆసక్తి ఉన్నవారు రాయల్టీ చెల్లించో లేదా ఒకేసారి కొంత మొత్తం చెల్లించి ఆ పేటెంట్‌కొనో, దాన్ని తయారుచేసి మార్కెటింగ్ చేస్తారు.

"సెలిఫోన్ టేప్ లేదా ఎడ్రస్ లేబుల్‌గా గమ్ పూసిన కాగితం వాడకం, కొత్తరకం బుక్ బైండింగ్‌లాంటి ఎలాంటి చిన్న కొత్త విషయము కనిపెట్టినా దానిమీద వచ్చే ఆదాయంతో జీవితాంతం బతకొచ్చు. ఇందువల్ల వీళ్ళ ఆలోచనా ధోరణిలోనే 'వ్యాపారం, అభివృద్ధి' ఉంటాయి దీన్ని కేపిటలిజమ్ అంటే నేను ఒప్పుకోను.

ఒక్కోసారి అమెరికన్స్ గురించి రాస్తుంది.

"అమెరికన్స్ మోస్ట్ ఫ్రెండ్లీ అనుకుంటుంది మిగతా ప్రపంచం. అది తప్పు. వీళ్ళను స్నేహితులుగా చేసుకోవడం కష్టం. 'రైట్ టు ప్రైవసీ'ని వీళ్ళు అధికంగా ప్రాక్టీస్ చేస్తారు. అందువల్ల అమెరికన్స్ క్లోజ్ మైండెడ్ పీపుల్ తమ మనసుని, సమస్యలని సాధారణంగా ఇతరులకి చెప్పరు. అదీకాక ఈ పోటీ, కృషి వాతావరణంలో ఎంతో బిజీగా ఉంటారు అమెరికన్స్. వాళ్ళతో స్నేహం చేద్దామన్నా అందుకు టైం ఇవ్వలేరు వాళ్ళు. సోమవారం నుంచి శుక్రవారం దాకా ఎంత కష్టపడి పనిచేస్తారో శని ఆదివారాలు అంత సరదాగా గడుపుతారు. బోటింగ్, స్విమ్మింగ్, బీచ్‌ల కెళ్ళడం, హైకింగ్, స్కీయింగ్, బౌలింగ్, ఫుట్‌బాల్ గేమ్స్‌కి హాజరవడంలాంటివి చేస్తారు.

"ఇండియన్స్ వీకెండ్స్‌లో తోటి ఇండియన్స్‌తో పార్టీలకీ, లంచ్‌కీ, డిన్నర్‌లకీ వెళ్ళడం, హిందీ సిన్మాలు ప్రదర్శించే థియేటర్లకి వెళ్ళడం, కొత్త సినిమాలు వీడియోలో చూడటం చేస్తుంటారు.

అమెరికన్స్ కున్న హాబీలు ఫాలో అయే ఇండియన్స్ తక్కువ.

అలాంటి ప్రాక్టికల్ లైఫ్‌గల దేశంలో బతికే వాణికి ముకుందం రాసే ఒక్క వాక్యపు ఉత్తరం ఎంతో బాగుంటుంది.

'అందం ఎలా ఉంటుందో తెలుసుకోవాలనుకుంటే అద్దం చూడు చాలు' అనో లేదా...

'నిన్ననే ఓ ఫోటో ఫ్రేం కొన్నాను నా కొడుకు కోసం. ఆ ఫ్రేంని ఎప్పుడు నింపుతావు?' అనో లేదా

'నీ మెడ బోసిగా వుంది. మంగళసూత్రం వుంటే అందంగా వుంటుంది' అనో..

అతను రాసిన వాక్యాలలో ఎక్కడా సెక్స్‌కి సంబంధించిన కోరికలు కనపడవు. ప్రేమ, పెళ్ళి, సంతానం ఈ విధమైన సంసారజీవనం తప్ప అదే వాణికి బాగా నచ్చింది.

22

ముకుందం, బాపన్నలకి మద్రాస్ సెంటర్‌గా దొరికింది. బాపన్న బంధువులు అడయార్‌లో ఉన్నారు. ఇద్దరూ వాళ్ళింట్లోనే దిగారు. ఒకేరోజు టోఫెల్, జిమేట్‌ని రాశారు, రెండూ రెండు రోజులయితే రెండో దానికోసం మళ్ళీ వారం పాటు ఉండాల్సి వస్తుందని.

ఇద్దరికీ తాము బాగా రాశామన్న తృప్తి కలగింది.

రిజల్ట్స్ వచ్చాయి. ఇద్దరూ పాసయ్యారు. బాపన్నకి 642 మార్కులు, ముకుందానికి 667 మార్కులు వచ్చాయి.

అమెరికన్ యూనివర్శిటీలకి సీట్లకోసం అప్లయ్ చేశారు.

ముకుందానికి యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియా, యూనివర్శిటీ ఆఫ్ సౌత్ కరోలినా, లాస్ ఏంజెలిస్‌లోని యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో సీట్ వచ్చింది. బాపన్నకి వాటిలో పెన్సిల్వేనియాలో నచ్చింది కాబట్టి యిద్దరూ అందులో చేరదాం అనుకున్నారు.

రెండోసారి ముకుందం వాణికి ఇంటర్నేషనల్ కాల్ చేసి మాట్లాడాడు.

"యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో చేరు. నువ్వు ఎం.బి.ఏ, పూర్తిచేసి ఉద్యోగం సంపాదించేదాకా ఫోన్ ద్వారా టచ్‌లో వుందాం" చెప్పింది వాణి.

"ఎల్లుండే మద్రాసుకు వెళ్తున్నాను, అమెరికన్ కాన్సలేట్‌కి. వీసా రాగానే ఫోన్ చేస్తాను" చెప్పాడు.

"ఐ లవ్ యూ హనీ!" చెప్పింది వాణి.

"హనీ ఏమిటి?" అడిగాడు ముకుందం.

చిన్నగా నవ్వి సమాధానం చెప్పింది వాణి.

"స్వీట్ హార్ట్ అన్నా, హనీ అన్నా డార్లింగ్ అని అర్థం."

"ఐ లవ్ యూ టూ హనీ" చెప్పాడు ముకుందం వెంటనే.

ఉదయం ఆరున్నరకి అమెరికన్ కన్సులేట్‌కి చేరుకున్నారు. చూస్తుండగానే క్యూ పెరిగిపోయింది.

ఇద్దరి పాస్‌పోర్ట్స్, డాక్యుమెంట్స్ పరిశీలించి వీసా ఫీజ్ 640 రూపాయల డి.డి.లు తీసుకున్నాక, టోకెన్ ఇచ్చారు. ముకుందం, బాపన్న కన్సలేట్‌లోకి వెళ్ళారు.

ఇద్దరికీ ఎంతో ఎక్సయిటింగ్‌గా ఉంది. అమెరికాలో టాప్ యూనివర్శిటీల్లో ఒకటైన దాంట్లో సీట్ రావడంవల్ల తమను బ్రెయిట్ స్టూడెంట్స్‌గా గుర్తించి వీసా ఇస్తారన్న ధీమా వుంది ఇద్దరిలో.

బాపన్నని పిలిచారు ముందు. సరిగ్గా నిముషమున్నర సేపే జరిగింది ఇంటర్వ్యూ. అతనికి ఎఫ్ - ఒన్ వీసాని మంజూరు చేసిందామె.

"ఈజీగా వచ్చింది" చెప్పాడు బాపన్న సంతోషంగా.

తర్వాత ముకుందాన్ని పిలిచారు.

"ఎం.బి.ఏ కోర్సు ఇండియాలో వుంది కదా? అమెరికాకే వెళ్ళి ఎందుకు చదవాలనుకుంటున్నావ్?" అడిగింది కన్సులేట్.

"యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియా డిగ్రీకి ఇండియన్ డిగ్రీకన్నా విలువ ఎక్కువ కాబట్టి."

"ఇండియాలో ఈ డిగ్రీ జాబ్ ప్రాస్పెక్ట్స్ ఎలా వున్నాయి?"

"బాగున్నాయి. ఇండియాలో ఇండస్ట్రియలైజేషన్ అధికమవుతోంది. దాంతోపాటు మేనేజ్‌మెంట్ జాబ్ ఆపర్చునిటీస్ పెరుగుతున్నాయి."

"మీరు అమెరికా వెళితే తిరిగి వస్తారన్న నమ్మకం ఏమిటి?" అడిగిందామె.

కొద్దిగా సందేహించాడు ముకుందం అబద్ధం ఆడేముందు.

"తప్పకుండా వస్తాను. మా అమ్మా నాన్న ఇక్కడే ఉన్నారు. మా ఇల్లు వుంది. మా నాన్నగారి వ్యాపారం వుంది"

"ఉద్యోగం కోసం వెళుతున్నావు కాబట్టి ఆ వ్యాపారం మీద మీకు ఆసక్తిలేదు"

"ఉంది"

బాడీ లాంగ్వేజ్‌లో, సైకాలజీలో శిక్షణ పొందింది కౌన్సులర్. ముకుందం ముఖంలోని భావాలు, చేతుల కదలికలు, కంఠస్వరంలోని తడబాటు, బలహీనత ఆమెకి చెప్పకనే చెప్పాయి. ముకుందం చెప్పే సమాధానంలో నిజం స్థిరత్వంలేవని.

"ఐ యాం సారీ. మీకు వీసా ఇవ్వలేం"

డాక్యుమెంట్స్, పాస్‌పోర్ట్ తిరిగి ఇచ్చేసింది.

అలా జరుగుతుందని ఎదురు చూడని ముకుందం స్థాణువయ్యాడు.

"ఎందుకని?" అడిగాడు ఆశ్చర్యంగా, బాధగా.

"మీరు తిరిగి ఇండియా రారు కాబట్టి"

"తప్పక వస్తాను"

"ఇక మీరు వెళ్ళచ్చు. గుడ్ డే"

"ప్లీజ్ మేడం.."

"ఐ యాం సారీ. నేను రూల్స్ తయారు చేయలేదు. వాటిని ఫాలో అవడమే నా డ్యూటీ"

ఖిన్నవదనంతో ముకుందం బయటికి వచ్చాడు. బాపన్నకి ఏడుపుగొంతుతో జరిగింది వివరించాడు ముకుందం. బాపన్న సిన్సియర్‌గా బాధపడ్డాడు. ముకుందం తండ్రికి ఫోన్ చేసింది వాణి.

"ఎఫ్. ఒన్ వచ్చిందా అంకుల్?" అడిగింది.

"రాలేదమ్మా. వాడు బాధపడుతున్నాడు" చెప్పాడాయన.

మర్నాడు కేబుల్ గ్రాం వచ్చింది ముకుందానికి వాణి నుంచి.

"Failure is not falling down. It is remaining there when you have fallen."

మరోసారి ప్రయత్నించమని దాని అర్థం.

ముకుందం మనస్తత్వం కూడా గెలిచేదాకా పోరాడే తత్వం. రెండువారాలాగి మళ్ళీ మద్రాసు వెళ్ళాడు.

మంగళవారం ఉదయం అన్ని డాక్యుమెంట్స్‌తో అమెరికన్ కన్సులేట్‌కి వెళ్ళాడు. ఉదయం పన్నెండు ముప్పావుకి అతని వంతు వచ్చింది. ఈసారి ముకుందాన్ని ఇంటర్వ్యూ చేసిన కన్సులేట్ ఆఫీసర్ వేరు.

"నువ్వు చదువయ్యాక అమెరికానుంచి తిరిగి వస్తావన్న గ్యారంటీ ఏమిటి?" అడిగాడు.

"నా స్వదేశం, నా తల్లిదండ్రులు, నా ఆస్థిపాస్తులు అన్నీ ఇక్కడే వుండగా అమెరికాలో ఎందుకుంటాను? నా రూట్స్ ఇక్కడే కాబట్టి తిరిగి ఇక్కడికే వస్తాను" గట్టిగా చెప్పాడు.

"నువ్వు వస్తావని అనుకోను. సారీ నీకు వీసా మంజూరు చేయలేను" అతను చిన్నగా నవ్వి చెప్పాడు.

"మీరు అపోహపడుతున్నారు. నో.ఐ.విల్ నాట్ లివ్ ఏన్ ఏ స్ట్రేంజర్ ఇన్ ఏ నేషన్ ఆఫ్ స్ట్రేంజర్స్"

"యూ బెట్. ఐ డోంట్ బిలీవ్ ఇట్. సారీ"

అతని పాస్‌పోర్ట్, కాగితాలు అన్నీ వెనక్కి తిరిగి ఇచ్చేశాడు.

"నాకు అమెరికాలోని బెస్ట్ యూనివర్సిటీల్లో ఓ దాంట్లో సీట్ వచ్చింది. టోఫెల్‌లో మంచి మార్కులు వచ్చాయి. ఆర్థికంగా నేను స్ట్రాంగ్. వీసా ఇవ్వకుండా నా భవిష్యత్తు నాశనం చేసే హక్కు మీకు లేదు. కాగితాలన్నీ సరిగ్గా వున్నప్పుడు వీసా యివ్వడం మీ బాధ్యత" ఎర్రబడ్డ ముఖంతో చెప్పాడు ముకుందం కోపంగా.

"సారీ మిస్టర్! ఐ హేవిన్డ్ మేడ్ ది రూల్స్. ఐ ఓన్లీ ఫాలో దెమ్" భుజాలెగరేసి చెప్పాడు ఆ కన్సులర్.

"ప్లీజ్ సర్"

ముకుందాన్ని చూస్తే జాలి వేసిందతనికి.

"ఐ మస్ట్ నాట్ బి టెల్లింగ్ దిస్ టు యు, బట్ యూ ఆర్ బ్లాక్ లిస్టెడ్" చెప్పాడు అతను.

"నిన్ను బ్లాక్ లిస్ట్ చేయడం దేనికి?" అడిగాడు బాపన్న ఆశ్చర్యంగా.

"చెప్పలేదు. భుజాలెగరేసి "ప్లీజ్ మేక్ రూం ఫర్ ది నెక్స్ట్ వన్" అన్నాడు. ఇక నేను అమెరికాకి వెళ్ళే అవకాశం లేదు" చెప్పాడు ముకుందం ఏడుపు గొంతుతో.

"దేనికి నిన్ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం? నువ్వు కాలేజీ యూనియన్‌లో కానీ, రాజకీయాల్లోకానీ లేవు. కమ్యూనిస్టువుకావు. అయినా రష్యా పోయాక అమెరికన్స్ అదీ పట్టించుకోవడంలేదు. ఇంకేమిటి కారణం?" అడిగాడు విఠల్ కొడుకుని.

ముకుందం కూడా జవాబు చెప్పలేకపోయాడు. అంత విచారంగా వున్న ముకుందాన్ని ఎన్నడూ చూడకపోవటంతో అతని తల్లితండ్రులిద్దరికీ బాధగా ఉంది. కానీ ఏమీ చేయలేరు.

రెండు రోజుల తర్వాత వాణి ఫోన్ చేసింది వీసా గురించి ఏమైందో కనుక్కోవడానికి. విఠల్ జరిగింది చెప్పాడు.

"ఓ అయాం సారీ! కానీ అలా కారణం లేకుండా బ్లాక్ లిస్ట్‌లో పెట్టరే? ఇంకోసారి పోస్ట్‌ద్వారా పంపి ప్రయత్నించమనండి."

వాణి సలహామీద మళ్ళీ అన్ని కాగితాలు నింపిన వీసా ఫారం, పాస్‌పోర్ట్ రిజిస్టర్డ్ పోస్టుద్వారా పంపాడు ముకుందం. రోజూ వాళ్ళనించి ఏం సమాధానం వస్తుందా అని ఆత్రంగా ఎదురుచూడసాగాడు.

బాపన్న అమెరికాకి వెళ్ళాక ఆర్నెల్లదాకా పనిచేసి సంపాదించడానికి వీలులేదు కాబట్టి ఆర్నెల్లకి సరిపడా వస్తువులు ఇండియాలోనే కొని తీసుకెళ్ళదలచుకున్నాడు. ఆ జాబితాని ఇద్దరూ కలిసి తయారు చేశారు.

కాఫీపొడి, టీ బేగ్స్, హార్లిక్స్ సీసా, సబ్బులు, సర్ఫ్‌పొడి, బట్టల సబ్బులు, పేస్ట్, ఎక్స్‌ట్రా బూట్‌లేసులు, కొబ్బరి నూనె, అన్నం వండికోవడానికి గిన్నెలు..

బాపన్న వెళ్ళేరోజు వచ్చేసింది ఆ రోజే అమెరికా కన్సులేట్‌నించి పాస్‌పోర్టు, ఇతర డాక్యుమెంట్స్ తిరిగి వచ్చాయి. ముకుందానికి వీసా మంజూరు కాలేదు.

"నీకూ వీసా వచ్చివుంటే ఇద్దరం కలిసి వెళ్ళేవాళ్ళం. ఐ యాం రియల్లీ సారీ" చెప్పాడు బాపన్న ముకుందానికి రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో.

అమెరికన్ కన్సులేట్‌లోని ఆఫీసర్‌లా రెండు భుజాలు ఎగరేసి చెప్పాడు ముకుందం అమెరికన్ ఏక్సెంట్‌ని అనుకరిస్తూ.

"ఐ హేవిన్ట్ మేడ్ ది రూల్స్. ఐ ఓన్లీ ఫాలో దెమ్"

ఇద్దరూ చిన్నగా నవ్వుకున్నారు.

"వెళ్ళగానే వాణికి ఫోను చేయడం మరచిపోకు"

హౌరా మద్రాసు ఎక్స్‌ప్రెస్ బయలుదేరాక బాపన్నకి వీడ్కోలు చెప్పి ఇంటిదారి పట్టాడు ముకుందం. తనని బ్లాక్ లిస్ట్‌లో పెట్టకపోతే ఆ రైల్లో ఉండేవాడు అతను.

Post your comments

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి

www.anandbooks.com
www.telugubooks.in